Barcode - 2030020025060
Title - krxshhiivaludu
Subject - GENERALITIES
Author - raami reddi duvvuuri
Language - Telugu
Pages - 55
Publication Year - 1924
Creator - Fast DLI Downloader
https://github.com/cancerian0684/dli-downloader
Barcode EAN.UCC-13

UNIVERSAL LIBRARY
OU_204574
UNIVERSAL LIBRARY

# కృషీవలుఁడు

దువ్వూరి రామిరెడ్డి

ద్వితీయ సంస్కరణము.

సర్వస్వామ్య సంకలితము.

సరస్వతీ భాండారము వారిచే

ప్రకటింపఁబడినది.

1924

ఈ ముద్రణమునఁ గొన్ని యెడలఁ గొన్ని పద్యములు సంస్కరింపఁబడినవి. కొన్ని క్రొత్తపద్యములు చేర్పఁబడినవి ఇదివఱకటి పద్యములలోఁ గొన్ని తీసివేయఁబడినవి. ఈ మార్పులను గ్రంథకర్తగారె యొనరించిరి.

ప్రకాశకులు.

# ప్రేమాంకము.

శా॥ అన్నా మన్నెము శేషురెడ్డి, యెటులో
యావిర్భవంబొంది స్నే
హౌన్నత్యంబు పరస్పరంబు రమణీ
యానేక భావంబులం
జెన్నారెన్ హృదయానుబంధరచనా
చిహ్నంబుగన్, మాఱుపా
టెన్నండుం దలచూప దిందనుక స్వై
వేచ్ఛాప్రభావంబునన్.

తే. గీ. అట్టి నిర్మలమైత్రికి నానవాలు
నవ్యకవితాసుమంబుల దివ్యమాల
నెమ్మిఁ గీలించుచున్నాఁడ నీదు కీర్తి
కామినీ కంఠసీమను గాంతు లొలయ.

ప్రియమిత్రుఁడు,

దువ్వూరి రామిరెడ్డి.

## దువ్వూరి రామిరెడ్డిగారి

## గ్రంథములు.

| | | | |
|---|---|---|---|
| 1 | నలజారమ్మ అగ్నిప్రవేశము. | (పద్యకావ్యము) | 1917 |
| 2 | కృషీవలుఁడు. | ,, ,, | 1919 |
| 3 | వనకుమారి. | ,, ,, | 1920 |
| 4 | జలదాంగన. | ,, ,, | 1920 |
| 5 | సీతావనవాసము. | (నాటకము) | 1921 |
| 6 | నక్షత్రమాల. | (ఖండకావ్యములు) | 1921 |
| 7 | నైవేద్యము. | ,, ,, | 1924 |
| 8 | కడపటివీడికోలు. | (పద్యకావ్యము) | 1924 |
| 9 | కవిత్వతత్త్వనిరూపణము. | (వ్యాసములు) | 1924 |

# ఉపోద్ఘాతము

ఆంధ్రవాఙ్మయమున ప్రకృతము ప్రసిద్ధికి వచ్చుచుండెడు గణ్యములగు నూతనసృష్టులలో నీకావ్య మొకటి. విషయమునందును భావములందును ఇయ్యది మన దేశముయొక్క నవజీవితమునకుం జేరినది. అచ్చటచ్చట శైలియందును దూరోపమలు మొదలగు నలంకారముల యందును ప్రాచీసవాసన యింకను కొంత వదల వలసియున్నటుల తోచెడిని.

కవి కాఁపుయువకుఁడు; విషయము కాఁపులజీవితము; దృష్టి యభిమానప్రేరితము. కృషీవలుల జీవితమును ప్రధానాంశముగ గ్రహించిన తెలుగు గ్రంథములలో నిదియె మొదటిది. ఈ విషయ నవ్యతను దలంచియె కాఁబోలు రామిరెడ్డిగారు ఈ క్రిందివిధమున వితర్కించి యుండుట :

అన్నాహాలిక, నీదుజీవితము నెయ్యంబార వర్ణింప మే
కొన్నన్ నిర్ఝరసారవేగమున వాక్పూరంబు మాధుర్యసం
పన్నంబై ప్రవహించుఁగాని, యితరుల్ భగ్నాశులై యీర్ష్యతో
నన్నుం గర్షకపక్షపాతియని నిందావాక్యముల్ వల్కరే?

తాను పూర్వలాక్షణికుల కరిగాఁపుగాఁడనియు స్వచ్ఛంద విహార శీలుఁడనియు నీక్రింది పద్యములలో బాహాటముగ చాటించియున్నాఁడు.

వనలతర్యైన నాకవిత పత్రపుటంబులఁ బూవుఁ రెమ్మలన్
దినదిన జృంభమాణయయి తేజరిలెన్ సహజప్రరోహ వ
ర్ధన నియమానుసారముగఁ, దల్లత యెన్నఁడుఃదోటమాలిపా
ణిని గనుగోని వన్యరమణీయతఁ జిల్కు నపూర్వపద్ధతిన్.

పంజరనిబద్ధకీరంబు బయలుగాంచి
యడ్డుకమ్ములదాఁటంగ నాసచేయు
నటు బహిర్నియమంబుల నతకరించి
మన్మనంబు స్వాతంత్ర్యసీమకుఁ జరించు.

కాన, యెవరేమియనుకొన్న దాని నేమి
గలుగుఁ; గాలమనంతము; ఇలవిశాల;
భావలోకము క్రమముగాఁ బడయుమార్పు
ఏల హృదయంబు వెలిపుచ్చ నింతయళుకు?

తన కవిత వనలత, స్వచ్ఛందవ్యాపనముగలది. చెన్నపురిలోని మాలీలదోహదములు కత్తిరింపులు మొదలగు చికిత్సలచే కృత్రిమసౌభాగ్యమువహించిన పూలచెట్లవంటిదిగాదు, "సహజ ప్రరోహావర్ధన నియమానుసారముగ" నల్లునట్టితీఁగె. "అపూర్వపద్ధతి" నవలంబించినది. శాస్త్రకారుల యాదేశములను, పారంపర్యప్రాప్త బహిర్నియమంబుల పాటింపదు. ఆగమపుంజములకుచేరిన గతానుగతికముగాదు. స్వాతంత్ర్యసీమను జరించు

నది. ఏమీ! పూర్వీకుల విధులను అతిక్రమింపవచ్చునా? వా రేర్పఱచిన కృతివిధానములుగాక అన్యము లెక్కడనైన నున్నవా? అని మూఢభక్తు లెవరైన ఆక్షేపించినయెడల "కాలమనంతము; ఇలవిశాల; భావలోకము క్రమముగాఁ బడయు మార్పు" అని కవి వారిని తిరస్కరించి తనదారిని తా నేగెడిని. వీరు చేసియుండెడు కవితావిషయమైన చర్చను కొన్ని యేండ్లక్రిందట సందర్భానుసారముగ నేనును "కవిత్వ తత్త్వవిచారము" లో చేసినాఁడను.

"ఐరోపాలోని కవీశ్వరులు కొందఱు కాఁపువారు, సైనికులు, మొదలైన తక్కువ వృత్తులవారి బ్రదుకులను వర్ణనార్హములని భావించి యెంతో సుందరముగఁ గావ్యములలో వ్రాసియున్నారు. మన గ్రంథముల మాత్రము చదివి యీపుణ్యక్షేత్రమైన కురుక్షేత్రముయొక్క స్థితిగతుల నరయఁజూచువారికి ఈ దేశమున బీదసాదులపై నాదరముగల కవి యెవఁడైన నున్నాఁడా? తుదకు బీదసాదులైన నున్నారా? యను సంశయము పట్టినను తప్పు వారిదికాదు! శోకరసము వర్ణింపవలయునన్న ననుకూలమగు సందర్భ మెయ్యది? క్రొవ్వుకాఱెడి నాయికా నాయకుల యూహామాత్రములైన కష్టములా? ప్రజలు దినదినము కన్నీరుగార్చుటకైన నవకాశములేక కుడుచుచుండు పరిపరివిధములైన గోడులా? శాంత రసమునకుఁ

ఘోషకమెయ్యది? తమకుఁ గష్టము దేనట్టిదైన రాజులయొక్క యుదారచర్యలా? ఆఁకటమాడి మలమలమాడుచు నింటికి వచ్చి వంట సిద్ధముకాకుండినను భార్యపైఁ గోపింపక, కన్నులు మూఁతవడుచుండ విధిని ధ్యానించుచు నొకమూలఁ గూర్చుండు పొలముకాఁపులయొక్క నడవడియా? ఆహా! జనసామాన్యముయొక్క ప్రతిదిన వృత్తములలో నెంతభావము, రసము, గుణము, నుపగతములై యున్నవో మనకవులకుం దెలియవుగదా. రాజపుత్రులను రాజకన్యలను, చాలసందుకు బ్రాహ్మణులను వేశ్యలనుబట్టి ఝుంఝూటమాడుటదప్ప కవితకు మేలైన యన్యకర్మములు లేవా?"

ఉన్నవియనుటకు ఈ "కృషీవలుఁడు"ను అబ్బూరి రామకృష్ణరావు, రాయప్రోలు సుబ్బరావు మొదలైనయువకులు విరచించియుండెడు నవ్యకావ్యములును ప్రమాణములు.

ఈ గ్రంథమునందు పొలముకాఁపులయు కాఁపుటిల్లాండ్రయు దైనందిన చర్యలతోడ ఋతువర్ణనములను కవి బహుచమత్కారముగ సమన్వయించి యున్నాఁడు. ఇది భావగంభీరుల కేగాని శుష్కపండితులకు సాధ్యమగు క్రియగాదు. ప్రాతఃకాలమునుండి రాత్రి నిద్రపోవువఱకు కృషీవలులుచేయు కార్యము లొకకూర్పు; వీనితో సమ్మేళించిన విధమున చేయఁబడియుండెడి ఋత్వాది ప్రకృతివర్ణన మింకొకకూర్పు. రెండును

భావకళా నిర్మితములును శోభితములును అయిన ప్రకృతి ప్రతిబింబములట్లు సత్యమును రామణీయకమును ధాల్చియున్నవి. కృతి పరిమాణమున చిన్నదైయును గుణమున నానాసౌభాగ్య శోభితముగనున్నది. వీని నన్నింటిని విడదీసి ప్రదర్శింపవలయునన్న సూత్రమునకన్నను వ్యాఖ్యానము విపులమగును. అట్లుచూపుటచే చదువరుల భావపరిశ్రమ విశేషములకు నిరోధముగల్గును. కాన, కొన్నియంశములను పేర్కొని విరమించెదను.

ఇందు గ్రామాంతర నివాసము వ్యవసాయవృత్తి ఇత్యాది ప్రకృతి సామీప్యజీవితమునకును మనుష్య స్వభావ ప్రవృత్తికిని ఉండు సంబంధము చూపబడియున్నది. మొత్తము మీద పట్నవాసులంత సుచివారుగారనియు, గ్రామవాసులు నడవడియందు మేలుతరమైన వారనియు కవి యొక్క యభిప్రాయము. ఇది నిర్వివాదము కాదని నామనవి. పట్టణస్థులకు గ్రామస్థులకు చర్యాభేదములు, స్వభావభేదములు లేవనలేముగాని పోలికలనుపెంచి యెక్కువతక్కువలను రూపించుట సాహసకార్యము. దేశాభ్యుదయమునకు పల్లెలెటులనో పురములును నట్లే యావశ్యకములు. మఱియు ఆర్థిక ప్రపంచమునకు ఆధారము వ్యవసాయమని కవిగారు చూపియున్నారు. ఇదినిజమేగాని తక్కినవాణిజ్యాది యభ్యుదయములు లేనిచో దేశము సముగ్రత తాల్పనేరదు.

నవ్యపాశ్చాత్యసభ్యత నాగరకత
పల్లెలందు నస్పష్టరూపములఁదాల్చి
కాలసమ్మానితములైన గ్రామపద్ధ
తులను విముఖత్వముం గొంత గలుగఁజేసె.

నేఁటి నాగరకత నీమేలుగోరక
యప్పుచేసి బ్రదుకుమని విధించు
నాయవృద్ధికన్న నావశ్యకపదార్థ
సంఖ్యహెచ్చఁ జిత్తశాంతి యున్నె?

కవికి పరిణామములు వలయునో వలదో తెలియకున్నది. కవితా భావములను శాస్త్ర తత్త్వములం బలె తార్కిక దృష్టితో విమర్శింపఁదగదు. వానియందు రసికులు గమనింపవలసిన విషయము సౌందర్యము. ఆ గుణ మీకావ్యమందు అఖండముగ నున్నది.

అసంబంధములగు వర్ణనలు సంగతులీ గ్రంథమున లేవు. ప్రతియంశమును చిత్తరువున కనుకూలించినదియు అగత్యమైనదియుఁగానున్నది. సంయోగతాలక్షణ మిందు ఏమాత్రము భంగము చెందకుండుట కవియొక్క భావనాగాంభీర్యమునకు అమోఘమైన సాక్ష్యము. తా వర్ణించు జీవితమును విషయములును తనకు అనుభవ వేద్యములు కాఁబట్టియు, వానియందు తనకు మనసు హృదయసంపూర్ణముగ లీనమై యుండుటచేతను వర్ణనలన్నియు హృద్యతాగుణపరిశోభితములు.

వానియందు సత్యస్ఫురణ, మనోహరత, హృదయాకర్షణాది శక్తులున్నవి. ఇదియ శిల్పముయొక్క పరమార్థము.

పాశ్చాత్యభాషలలో "పాస్టొరల్సు" నాఁబడు పశుపాల్యాది గ్రామాంతర వృత్తులవారి అకృత్రిమ జీవిత స్వభావాదుల వర్ణించు కావ్యము లనేకములున్నవి. అయ్యవి గ్రీకు లాటిన్, భాషలలో పుట్టి ఆధునిక ఐరోపా వాఙ్మయముల యందును వ్యాపకమునకు వచ్చియున్నవి. హైందవ భాషలలో ఈ తరగతికిం జేరిన కావ్యములలో శ్రీకృష్ణుని బాల్యక్రీడలు, బృందావన జీవితము, గోపగోపికాసంచారములు ఎంతయు హృదయరంజకములు. భాగవతమునందలి దశమస్కంధమును, విశేషించి యెఱ్ఱాప్రగ్గడయొక్క హరివంశ పూర్వభాగమును దేశీయ వాక్ప్రపంచమున తమస్సునడంచి చల్లని వెన్నెలను కురిపించి చిత్తానందముచేయు చంద్రబింబములవలె నున్నవి. జయదేవకృతమైన గీతాగోవిందమును నిట్టిదియ. గోపికలను వదలిన గ్రామాంతర జీవిత మలభ్యమసియో, కృష్ణకాంతలకు తదనంతరము గోపికాసంతతులు నశించిరను భ్రమగొనియో మనకవులు అట్టివర్ణనలను, ఇతరసందర్భముల, ముఖ్యాంశములుగ గైకొని వర్ణించుట మానివేసిరి. ఈ నాఁటికి ఆ వృత్తములు మరల కవితాదృష్టికి నర్హములని భావింపఁబడుట తటస్థమైనది. ఇఙ్లెప్పుడో నశియించినమహోత్తరమైన వృత్తమును

పునర్జీవితముం జేసి దివ్యాకృతిగ మనముందర రామిరెడ్డిగారు నిలిపియుండుట వారి యసాధారణప్రజ్ఞను సూచించుచున్నది.

కృషీవలుని జీవితమంతయు పుష్పాలపాన్పు గాదని కవిగా రెఱుంగక పోలేదు. పట్నవాసులకు వారికిని గల ఆర్థికస్పర్థ, సర్కారువారు వారియెడల చేయు అనాదరణము, ముఖ్యముగా వారి నావరించియుండెడు అజ్ఞానాంధకారమును, దానిచే వారిని పట్టి బాధించెడు దురాచార పిశాచముల విషయమును రాజకీయ సాంఘికాదినీతులును, సంస్కారముల యావశ్యకతను సూక్ష్మముగఁ దడవియున్నారు. మింటికెగయు పక్షియైనను భూమిమీద పెట్టియుండెడి గూటిపై చూపువేయక యుండునా? కాపువారియొక్క దుఃస్థితి యెప్పుడు తొలఁగును? వారికి ముందున్న పూర్వపు రెడ్డిరాజుల కాలమందువలె ఉన్నతపదవికి రారా? అను విచారములు అసలు సహజములే గద. "కాలగర్భంబునం బెట్టి ఘటనగలదో; భావి పరిణామ మెవ్వరుపలుకఁగలరు" ఎవ్వరుపలుకఁగలరో గాని నావలన మాత్రముగాదు. రైతు లెట్టి దారిద్ర్యముపాలైయున్నారు! "కార్యారంభంబును ధైర్యముగ విడకుమయ్యా" అని కవిగారు సంబోధించుచున్నారు. వీరి మాటల నాలకించి యాదరింతురు గాక. ముఖ్యముగ మా కులమువారికి అతిథిసత్కారము ఒకరు చెప్పక చూపక వచ్చిన సదాచారము.

అన్నదానము మా వారివలె చేయువా రితరులున్నారో లేదో. ఎట్లును మించినవారు లేరనుట అతిశయోక్తిగాదు. ఈ విషయమును రామిరెడ్డిగారు ఈ క్రింది విధమున రమ్యముగ నుడివి యున్నారు.

ఉండి తిన్నను లేక పస్తున్న గాని
యాసచేయవు పరుల కిస్వాతంత్ర్యంబు;
నాఁకలెత్తఁగ నీపంచ కరుగు నతిథి
తినక త్రావక పోయిన దినము లేదు.

కాఁపుపిల్లాండ్రను గూర్చి కవి చేసిన స్తుతులన్నియు సత్యమునకు మీఁటినవి కావు; తక్కువ. వారియొక్క "శాంతి నీతియు సుకష్టసహనశక్తి, నెవరికలవుగుమరు?" స్త్రీలంగూర్చి పహొనచించిన ప్రశంస యెంతయు సత్యము; గంభీరమును.

అతుల సంసారసాగర మందుఁ గాల
జలము సుకృతదుష్కృతవాత చలితమగుచు
సుఖవిషాదపుఁదరంగలై సుడియుచుండ
పడవనై గట్టుఁజేర్తువు పతిని, గృహిణి!

సంగ్రహించి వ్రాయు శక్తియందు ఈ కవిని మించినవారుండరు కాఁబోలు. ఈ గ్రంథమును చదువఁ జదువ ఏరీతిని నిన్నియంశములను నిన్ని కొద్దిపుటలలో నిక్షేపించినాఁడు అను ఆశ్చర్యముఁ దాల్పని వారుండరు. పునరుక్తి, నిరర్థకవృత్తి, యిత్యాదికాలవ్యయమును స్థలవ్యయమును చేకూర్చుపద్ధతులు లేవు. తనకుల

స్థులయ్యె యీకవియు మితభాషి. అర్థము ఎక్కువ పదములు తక్కువ అను శ్లాఘనకు పాత్రుఁడు.

మనుచరిత్ర కళాపూర్ణోదయాదులలోని పద్యముల ననుకరించిన తలపోతలు వ్రాతలు ఒకటిరెండు చోటుల నున్నట్లు తోఁచెడిని. ఇది దోషముగాదు. ప్రమాదము కావచ్చును. వీరి యాథార్థ్యవర్ణనాశక్తిని చూపించుటకై కొన్ని పద్యముల నుదహరించు చున్నాను.

### లయవిభాతి.

చలువగల కప్పురము చిలికినటు చల్లనయి,
    లలిత కలధౌత మృదు విలసనము పోలెన్
మొలక లిడు వెన్నెలల చెలువము దిగంతముల
    కలముకొని తారకల తళుకులను గప్పెన్
గలువపొడి గందపొడి దోలఁక సుడిరేఁగుచును
    మెలఁగు గాలి పయ్యెరలు నలసతఁ జరింపం,
దలఁపున రసార్ద్రమగు వలపు లిగురింప దిన
    కలకల మడంచి నిశ గొలిపెఁ బ్రమదంబున్.

స్నానమొనరించి వెన్నెల చలువ బయల
బిడ్డలున్నీవు నిల్లాలుఁ బ్రీతిఁ గుడిచి,
పాడుపు కతలు, సమస్యలుఁ, బూర్వచరిత
లంత వచియింపు వారలు సంతసింప.

శ్రమ, విషాదమ్ము, లాసలు, సర్వకాల
హృదయ ఖేదక చింతలు, నిదుర యణెదు

శాంతవారిధి లీనమై సమసిపోవ
విశ్రమింపుము సైరికా వేగువఱకు.

నేనును విశ్రమించెదను. వేగువఱకు గాదు. మఱి రామిరెడ్డిగారు ఇంకొక గ్రంథము వ్రాయువఱకు. వ్రాసినతోడనే పఠనమునకుం దొడంగెద.

ఇట్లు

కట్టమంచి రామలింగారెడ్డి.

# కృషీవలుఁడు

సమయమమూల్య, మొక్కనిమిషంబు వృథాచనఁ గ్రమ్మఱింపనే
రము; మనయాయువాత్రుటిపరంపరయాట నెఱింగి, నిద్రమాం
ద్యమునుదొలంగి మీపనుల నారయుఁడో జనులారయంచు డం
బముగ మెడన్నిగిడ్చి కృకవాకము గూసెడి నింటికొప్పునన్. ౧

వడఁకుచుఁ బాడు మేల్కొలుపుపాటకు రాటముఝుమ్మంచుఁ జే
సెడి మధురారవంబు శ్రుతిచెల్వు వహింపఁగ, రాజనాదిముం
గఱ నిడుకొన్న కుంపటిసెగన్ సొగయించుచు నమ్మలక్క లొ
క్కెడఁగుమిగూడినూల్వడకునిత్తఱిఁ దోఁచెను రెడ్డిచుక్కయున్.

అత్తల యాఁడుబిడ్డలభయంబొకవంకయుఁ గోర్కె వేఱొకం
జిత్తములాగఁ గ్రొవ్విదయుఁ జీరయు వేసవరించి తూఁగుమై
మత్తున నున్న వల్లభుని మంచము మెల్లన వీడి దీనయై
బిత్తఱికోడ లిల్వెడలె వేకువఁ బ్రాఁచిపనుల్ వ్యాసర్పఁగన్. ౩

రచ్చచపారమందు నిడిరాతిరిఁ బుచ్చిన బాటసారులుం
జిచ్చు రగిల్చి మంటలకుఁ జేతులు చాపుచుఁ గూరుచుండి వా

రిచ్చకు వచ్చినట్టి కతలెల్ల వచింపుచుఁ దెల్లవాఱఁగా
వచ్చిన మాటముల్లెఁ గొను పైనపుసందడిఁ రేఁగె గొల్లునన్. ౪

అమ్మో, తూరుపు దెల్లవాఱె, నిఁక లెమ్మా, యంచనన్ మాల్గి మం
చమ్మున్ డిగ్గక, బుజ్జగించినను, పో చాల్చాలు, వేనీళ్ళు లే
కమ్మై నేఁ బలుదోమఁ గొందుఁ జలిలో, నింతాగడంబా, యటం
చమ్మం గూఁతురు కోపగించుకొను గన్యాత్వంపు గారామునన్.

ఉషయ నెడు కాఁపుటిల్లాలు హసన్న రాజ
నముల వరివెన్నుగంప గేహమున దింప
సంబరంబున నెగురుచు సరసఁ జేరు
పిల్లలనఁ బుల్గుతుటుములు పింటికేగసె. ౫

అరుణమయూఖముల్ తరులతాంతరమార్గము దూఱి గేహగో
పురములఁ బ్రాఁకు బ్రొద్దువొడుపుం దరుణంబున నీటికోసమై
సరసుల కేఁగు కాఁపునెఱజాణల నూపురమంజులార్భటుల్
నెఱసెఁ బ్రభాతమన్ శిశువునేర్చెడి ముద్దులమాటలో యనన్. ౬

ఇరువ్రులఁ జూరులందుఁ జరియించి తమోహరణైక దక్ష భా
స్కర కిరణాళి నీమృదులశయ్య సువర్ణమయంబు చేసె ని
ద్దుర నిఁక నైనమాని వెలిదోలుము బీళ్ళకు నాలమంద, ని
త్తఱిఁ దమిదీఱ మేయుఁ బలుదంటులుఁ గమ్మనిమంచుపచ్చికల్.

ఓయిహాళిక, యెంత ప్రొద్దాయెఁ జూడు
మింత నిదురేల? పాలకై గొంతురాయు
లేఁగ యీదూడ పలుపును లాఁగికొనుచు
నఱచుచున్నది "యంభయాంభా" యటంచు. ౯

పొదుగు నిండుగఁ బాల్చేపి గుదులు త్రెంపి
దూడకై దొడ్డిగోడ రాపాడి దాఁటెఁ
దఱిపి పెయ్య; యింకేల మాంద్యమునఁ బొదల?
లెమ్ము నిద్దుర; పాల్దీయఁ దెమ్ము చెంబు. ౧౦

బిఱ్ఱుకడుపుగ నన్నంబుఁ బెరుఁగుఁ గుడిచి
దొడ్డి వెడలించుచున్నాఁడు గిడ్డగములఁ
దమ్ముఁగుఱ్ఱఁడు; లేదూడ లమ్మలకును
బరుగు లిడనీక కట్టుము పలుపు వెట్టి. ౧౧

చెమరు ముత్యాలు చెక్కిళ్లఁ జెదరిజాఱ
ముద్దుచన్నులు పయ్యెద మురిపెమాడఁ,
గాజునీలాలు మధుర నిక్వాణము లొలయ
దధి మథించెడు కాంత గీతములు వినవొ? ౧౨

ఉయ్యెల నిద్రలేచి తనయుం డెదుటన్ జనయిత్రి గాంచకే
కుయ్యిడుచున్నవాఁడు కులుకుంగనుదమ్ముల బాష్పబిందులొ

య్యొయ్యనఁ జిందువాఱ, సతియు న్నికటంబున లేదు, లేచి య
బ్బయ్యను నెత్తి మేను పులకాంకితమౌనటు ముద్దువెట్టుమా. ౧౩

చలికప్పుగప్పి విచ్చలవిడి లేమొండెఁ
    గ్రాగు ముద్దులకూఁతుఁ గౌఁగిలించి
పుసికి దోఁగాడుచు బొమ్మలతో నాడు
    పసిబిడ్డ మోము చుంబనముచేసి
మొగతాలి సరసాల సిగ్గాలు పలుకుచు
    నవ్వినందుకు మాఱునవ్వు నవ్వి
పనివాఁడ్రు వచ్చియుండినఁ దండ్రి యేమను
    నోయను శంక లోనారసికొనఁగఁ

జలిది కడుపారఁ గుడిచి యెద్దులను దోలి
కొనుచు మడి కేఁగుచున్నారు, గనుము, యొరులు
వారు సేతోఁడివారలు గారె? రెడ్డి
యువకు లెచ్చటఁ గొఱగాకయుందురయ్య? ౧౪

మనపనిఁ జేసికొన్న నవమానమె? ప్రాఁచిపను ల్వ్యానప్పుచున్
వనిత యతిప్రయాసమున బర్వ్విలిడం గనుఁగోవె? కావడిం
గొని సరసీజలంబులను గోపముసేయక తెచ్చియిచ్చి కాం
తను బరితోషపెట్టుము; వృథావచన మెప్పుడు నట్టిసాయముల్.

సోమరిపోతవై జనకుసూక్తు లలక్ష్యము చేసి కొంటెపో
రాములఁ బ్రొద్దుపుచ్చకు, నిరర్థకభూములనైనఁ జెమ్మటన్
శ్యామల సస్యవంతముగ సల్పెడు కాఁపులు నోగులైన నిం
కోమెడువార లెవ్వరు జనోత్కరముల్ సరసాన్నదాతవై. ౧౬

అరుణకిరణుండు తూర్పున నవతరింపఁ
బ్రాణిలోకంబు మాంద్యమ్ముఁ బాసె; నింక
నింట నుండుట మర్యాదయే కుమార!
చలిదిచిక్కంబు గట్టుము పొలముఁ జేర. ౧౭

అప్పుడప్పుడె విచ్చి యలరు చేమంతుల
    కమ్మనినెత్తావి గడలుకొనఁగ,
రత్నకంబళి మట్లు రాణించు బీళులఁ
    బలువన్నెపూవులు బలిసివిరియ,
వ్రాలఁబండిన రాజనాల కేదారంబు
    పంటలక్ష్మికి నాటపట్టుగాఁగ,
ప్రొద్దుసిగ్గులు సోకి పొగమంచుమబ్బులు
    బంగారు వలిపంబు పగిది వ్రేల,
ఈనిమేషమందు నిల యెల్ల నందమై
స్వర్గశిల్పి యింద్రజాల శక్తి

వ్రాసినట్టి చిత్రపటమన విలసిల్లెఁ;
దొంగిచూచు మిఫుకు తూర్పుదిక్కు! ౧౪

వేకువనె లేచి వైకుంఠవాకిళులను
ముంగిట రచించి గుమ్మడిపూలతోడ
గొబ్బిముద్దల నిలిపి కుంకుమను జల్లె
నీ యనుంగుకూఁతురు; గాంచుమోయి పాఁబడు. ౧౫

గనిమల తుంగకుఁ గటికకాడల కల్లిన పాలెగూళ్ల స
న్నసి పటికంపుమంచు పడి నాణెపు ముత్తెసరాల పోలికం
గనుఁగొన రమ్యమయ్యె రవికాంతులఁ దేలుచు, నిట్టి భావమో
హనపు నిసర్గ శిల్పముల, హాలిక, త్రొక్కక దాఁటిపొమ్ముకేఁ

పొలముల కేఁగు పల్లెతలు పుత్తడిగాజులు ఘల్లుమంచు రా
పిలి యులివెత్తగం జిటికెవేయుచు నిగ్గని యేలపాటలం
జెలువుగఁ బాడ నుప్పతిలు సిగ్గున నూరక పోక మాఱుపా
టల నెలుగెత్తి పాడుమ, మిటారుల నవ్వుల కాస్పదంబుగన్.

గ్రామవాసుల కిట్టి నిష్కైతవంపు
ముగ్ధపరితోషములు సుఖభోగ్యములగుఁ;
బట్టణ నివాసకుల శుష్కభావములను
నిట్టి సామాజికానంద మెసఁగఁగలదె? ౨౨

ఓయి రెడ్డియువక, యూరక యిందందుఁ
డరుగ నేమి ఫలము? తిండిచేటు!
తండ్రి కోఁతమునుల దగ్గఱఁ బనిసేయు,
నన్నమునకు నింటి కనుపుమయ్య. ౨౩

వ్రాలినకొప్పు లోపలి పూలరేకులు
సడలి యొక్కొక్కటి జాఱుచుండఁ,
బరువంపు రొమ్ముపైఁ బయ్యెద చినుగుళ్లు
గాలికి నట్టిట్టుఁ గదలియాడ,
నెలుగెత్తి పాడెడి యేలలు విని బాట
సారు లెక్కసకెము సలుపుచుండఁ,
దమ్ములపుంబూఁత దవిలిన వాతెఱ
పైఁ బలుచాలు నవ్వాక యొనర్పఁ,
జేతికొడవలి ఝుళిపుచుఁ జిన్నెలాఁడి
కన్నెమాలెత పిడిచుట్టి మున్నుమున్న
మునుపు తఱిఁగెడి; నింటికిఁ బోవువేళ
సందెడో దండో యీరాలేవె కర్షకకుమార! ౨౪

ఆఁకటిచిచ్చుబాధ సగమైన యొడళ్లను నంటుడొక్కలుం
జీఁకటిచూపులుం మొలకు జేనెడుపేలిక గల్గి జీవితం

బే కడగండ్లుగా, బఱిగ మేరెడి బీదల వెళ్లగొట్టి చీ
కాకొనరింపఁబోకు ; వెలిగా దల యాఁకటిమంట నీకునర్మ. ౨౫

పసిఁడిపూసల పేరుల పగిది దోర
పక్కముగఁ బండి నేలకు వ్రాలు కంకి
గుత్తులఁ బిచుకతిండికిఁ దెత్తుననుచు
నింతికిం జెప్పి మఱచితే యింతలోన. ౨౬

పడఁతి యొంటికత్తె ; పనిపాటు సేయను
నిడుగు దోడుగులకును నెవరు లేరు ;
చంటిబిడ్డ యొకఁడు, సంసారభారంబు
పీల్చి పిప్పిసేయు బీదరాలి. ౨౭

చెలియా, యిత్తఱి నిన్నుఁ గన్గొనిన నాచిత్తంబు తాపార్తమై
కలఁగుం, గష్టకుటుంబకార్యముల నెక్కాలంబు నిర్మగ్నవై
మెలఁగం జూతువు మంచిచీర రవికెల్ మేలౌనలంకారముల్
దలఁపంబోవు, తలైన దువ్వ ; విఁక లేదా మేర నీపాటుకుర్మ.

మున్నూటరువది దినముల
నెన్నండును గన నశక్య మేపనియును లే
కున్ననిమేషము ; కాఁపుం
గన్నియ, నీ కాటవిడుపుకాలము లేదే? ౨౮

నిత్యకృత్యములం దొక్క నిమిషమైన
దొంగిలింపుము కై సేయఁ దోయజాక్షి!
యఖిలకామినీ సామాన్యమౌఁ బ్రసాద
న ప్రియత్వము నీయందు ననలుకొనదా? ౩౦

స్వాంతమున నీకు రామణీయక ప్రాప
యంతరించె నటంచు నే ననను గాంత,
కాని, యెడలేని సంసార కష్టములకు
స్త్రీప్రకృతి బలి వెట్టుట చెల్లదమ్మ. ౩౧

త్యాగమునకైన నొకహద్దు దగును గాని
శలభ మట్టుల నాత్మనాశనము మేలె?
పొలఁతికి సతీత్వ సౌందర్యములును రెండుఁ
బ్రార్థనీయ వరంబులై పరగుఁగాదె! ౩౨

అతివ, నాయూరడింపుల యందె దవిలి
చిన్నకూఁతురి నంపవు జొన్నమడికిఁ,
బావురంబులుఁ జిల్కలు పాలకంకి
విఱచుకొని యాకసంబున వెడలెఁ జూడు. ౩౩

పడనటఁ జిల్క లన్నమిషఁ బైట దొలంగినఁ జూచిచూడకే
యొడిసెల ఱాయిఁబెట్టి పొలమోరలఁ బోయిడి బాటసారిపైఁ

ఒడఁ దెగ రువ్వెదేల మగువా, యిటులఁ బనుచుందనాల తుం
దుడుకుఁదనంబు నీయెడఁదఁ దొందర వెట్టెనె? నైజమేగదా!

ఐననయ్యెఁ గాని, యాఁకలి బలుదొడ్డ,
రెండు కంకు లిమ్ము రెడ్డిపడుచ.
ప్రొద్దువోవు మాదు పొలిమేరఁ జేఁను,
బాట నడచి నడచి బడలె మేను. ౩౧

అని కడువేడు పాంథులకు నచ్చటఁ జేతికినందు కంకులం
ఈనఁడని చెప్పి మంచెపయిఁ దియ్యనిరాగము దీయు ప్రాయపుం
గొనబుమిటారి, నీ మనసుకుందు నెఱుంగదుగాని, యింటిలో
ననయము లేమిడిన్ సయిచు నమ్మవతల్ దలపోయ వేలొకో!

చిన్నప్రాయమందె చీడపుర్వును దెచ్చి
నీదుహృదయకళిక నిలుపఁదగదు.
పచ్చపైరుచేల బాంధవ్యమునఁ జేసి
పెరిగినావు ప్రకృతిబిడ్డ వోలె. ౩౨

పూలకారుగాలి పొలముపై పీతెంచె
వలపు మొలిచి యొడలు పులకరింప,
మనసుకోఁత లెల్ల మానిపోఁ గోయిలఁ
గూడి పాడు మొక్క క్రొత్తపాట. ౩౩

పైరుంబచ్చలులేని లోపమును పాపఁబోలెఁ గ్రొంబూలసిం
గారంబుం గయిసేసి తేఁటిపురులం గాంతిల్లె వల్లీతతుల్,
దాడింబోగొమ్మ బిచ్చకత్తె యయి సం దావుల్ గుబాళింపఁగం
బూఁ కేసర చికురంబులం దుఱిమి సొంపుం బెంపుఁ బాటించెడిన్.

కనుమ, యాబిచ్చకత్తెకుఁ గలసుఖంబు
నందు పగపాలు లేదు నీయాలి కకట!
పవలు నిద్రించెదే కాఁపుపడుచువాఁడ,
పొలఁతి నిట్టూర్ప నీమొద పొగిలిపోదా? ౪౦

కాఁపులెల్లరు నాగళ్లు గట్టి కోడ
యెడుగు దున్నెద రిపుడు; నీ వదనెఱుఁగవో?
యాలసింపక యెడ్లఁ గయ్యాలను దోలు
మోయి, యెండలు ముదిరి పెల్లుక్కనెట్టె. ౪౧

శ్రమలు లేకయె ఫలములు దుముకఁబోవు,
పిండికొలఁదియె రొట్టె; యోపిన విధానఁ
గష్టపడుము కృషీవలా, గలుగు సుఖము.
ఉత్తయాసల కన్న మే లుద్యమంబు. ౪౨.

అర్కబింబము మధ్యందినాతపంబు
గాయుచున్నది మేనెల్లఁ గమలిపోవ;

నురుగుఁ గ్రక్కుచు నూర్చుచు, నోరుదెఱచి
యొక్కయుక్కగ్గై నఁ బెట్టవు దుక్కిటెడ్లు. ౫౩

ఖరకరతాపతప్తమయి కాయము ఘర్మకణాళి నీనుచుఁ
సొరిగెడి సత్త్వహీనముగఁ, జూపులు దీనములయ్యెఁ బ్రొద్దునం
బొరసిన మోము తేటలెటుపోయెనొ! దప్పియు హెచ్చెనోయి, యి
త్తఱిఁ దరుమూలశాయివయి తాపమువాయుమ చల్లనీడలన్

కరముఁ గష్టించు నిను గాంచి కనికరమున
నెండవేడిమిఁ దొలఁగించు నిచ్చతోడ
వారిదం బాతపత్రమై వచ్చెఁ గాని
మారుతాహతి శిథిలమై మరలె నదియు. ౫౪

తరువులఁ గోటరంబులకుఁ దారెను బక్షికులంబు, బట్టెలున్
సరసులఁ జొచ్చె రోజుచుఁ, గనంబడ రెవ్వరు దారులందు, నీ
సరణి సచేతనప్రకృతి చల్లదనంబున కాసచేయు నే
నెరియఁగ నీవుమాత్ర మిటులేల శ్రమించెద వెట్టయెండలన్?

బాటల వేడిదుమ్ములకుఁ బాదములం జిఱుబొబ్బలెత్తెఁ గ్రీ
యూటగఁ జెమ్మటల్ మొగమునుండి దొరంగఁగఁ గూటిదుత్తతోఁ
బాటలగంధి వచ్చెడిని బాపము! వేగమ నీట మున్గి యా
చోటనె మజ్జిగన్నము రుచుల్వచియింపుచు నారగింపుమీ.

తరుణీ, ధూళులఁ గాల్లుగాలెనని సంతాపంబునం గాంతునిం
జిఱుముఱ్ఱాడక, గేహనిర్వహణముల్ సేద్యంబు సాగంగ ని
ద్దఱుఁ గష్టింపఁ గుటుంబరక్షణము సాధ్యంబౌను;భిన్నాధ్వసం
చరణాసక్త హయద్వయంబు రథముల్ సాంతంబుగా లాగునే?

శ్రమ కుచితంబుగా ఫలము సంధిలదో యని చింతవొందకో
రమణి, నిదాఘతాపము దొఱంగెడు నంతకు మఱ్ఱియూడజొం
పముల యుయ్యాలలూఁగి పదమాత్రన నింటికిఁ బొమ్ము, పాలకై
కుములుచు నేడ్చునేమొ యనుగుం బసిపాపఁడు నిద్ర లేచుచున్.

దారిఁ జరించుచున్నపుడు దగ్గఱనున్న తటాకమందు నిం
పారు సరోజముల్ గొని గృహంబునకుం జనుదెమ్ము, బాలకుం
డా రమణీయ పుష్పముల నచ్చెరువొందుచుఁ గాంచి యాడుకోఁ
దీఱిక వంటయింటి పని దీర్చుము కాంతుఁడు వచ్చునంతకున్.

పూవుం దేనియ లారగించి మధుప వ్యూహమ్ము కర్ణప్రియం
బై వర్ధిల్లు మనోజ్ఞగీతముల రాగాలాపముం జేయఁగా
నీ వేలా కలఝంకృతిన్ స్వరము లెంతే నైక్యముం బొందఁ గాం
తా, వాకోవాక పల్లెటూరి పదమైనం జిత్తముప్పొంగఁగన్.

సిరిగల యాఁడుబిడ్డలు విచిత్రపుఱాలనగల్ ధరించి బం
గరుసరిగంచు చీరలను గట్టి చరింపఁగఁ గాంచి యాస లోఁ

బొంపయొకు కృత్రిమంబులగు భూషలుదాల్ప; నమూల్యరత్నమా
నసిస్సుగ్రేష చిత్తజలబంబు వెలుంగ నలంకరింపుమీ. ౧౧

వెలగల రత్నభూషలను వేలకుఁ దాల్చిన నిన్నుఁగాంచుచో
గలుగదు ప్రేమ భర్తకు వికస్వరమా వదనారవిందమం
దొలికెడు ముద్దులేనగవు లొక్కని మేషము దోఁపకున్న;భూ
షలు ప్రణయానుబంధ సదృశమ్ములు గావు కులాంగనాళికిన్.

అతుల సంసారసాగర మందుఁ గాల
జలము సుకృత దుష్కృత వాతచలిత మగుచు
సుఖవిషాదపుఁ దరఁగలై సుడియుచుండ
పడవవై గట్టుచేర్తువు పతిని గృహిణి! ✓ ౧౨

ఈయెడ నాతపంబు శమియించెను, నీడయుఁ దూర్పుదిక్కుకుం
బోయెను భర్తతో నలిగి పొందెడయం జను జాయపోలికన్
వాయువు సుప్రసన్నమయి పైఁబయి వీచెడు లేచిరమ్ము, లే
దోయి విలంబనం బనెడి యుక్తి కృషీవలవాఙ్మయంబునన్ .

మనుజసమాజనిర్మితి సమంబుగ నీకొక ముఖ్యమైన వృ
త్తి నియత, మట్టి ధార్మికవిధిం జిరకాలము గౌరవంబుతో
మనిచిన నీపితామహు లమాంద్య సుశీలురు సర్వవృత్తిపా
వన కృషిజీవనైక పరిపాలన లోకహితార్థకాంక్షులై. ౧౩

అనుదిన మిట్లు కష్టపడ నావిధి వ్రాసె నటంచు నీమదిం
బనవకు కర్షకుండ, యిలపై జనియించినదాది చెమ్మటల్
దొనక శ్రమించి పౌరుషముతో బ్రతికించెదు నీకుటుంబమున్,
మనమునఁ గైతవాశయము మాదునకైనను లేదు నీయెడన్.

నేలనూతుల కుగ్గాలు నిలుపువారు,
కోడితలకు మోకాళ్లకు ముడుపులెట్టు
వారుఁ జిటికెలఁ బందిళ్ళు పన్నువారు
నిన్నుఁ బోలరు, తమ్ముఁడా, యెన్నఁడైన. ౫౮

పసుపులు పట్టుమంచములుఁ బట్టుతలాడలు సంబరంబులుం
గరులుఁ దురంగముల్ ప్రియము గాంచనముల్ మణిగణంబులుండెసన్
ధర సకలంబు సొంతమయినం దనికోదు మనుష్యతృష్ణ, ని
త్పరిచితులైన వారి నెటఁ బాయదె తృప్తి నిసర్గశ్రమంబునన్. ౫౯

అన్నా హాలిక, నీదుజీవితము నెయ్యంబార వర్ణింప మే
కొన్న స్నిగ్ధరసారవేగమున వాక్పూరంబు మాధుర్యసం
పన్నంబై ప్రవహించుఁగాని యితరుల్ భగ్నాశులై యీర్ష్యతో
నన్నుం గర్షకపక్షపాతియని నిందావాక్యము ల్వల్కరే! ౬౦

వనలతయైన నాకవిత పత్రపుటంబులఁ బూవు రెమ్మలన్
దినదినజృంభమాణయయి తేజరిలెన్ సహజప్రరోహ వ

ర్థననియమానుసారముగఁ; దల్లత యెన్నఁడుఁ దోఁటమాలిపా
ణిని గనుఁగొని వన్యరమణీయతఁ జిల్కు నపూర్వపద్ధతిన్. ౬౧

పంజరనిబద్ధకీరంబు బయలు గాంచి
యడ్డుకమ్ముల దాఁటంగ నాసచేయు
నటు, బహిర్నియమంబుల నతకరించి
మన్మనంబు స్వాతంత్ర్యసీమకుఁ జరించు. ౬౨

కాన, యెవ రేమి యనుకొన్న దాన నేమి
గలుగుఁ? గాల మనంతము; ఇల విశాల;
భావలోకము క్రమముగాఁ బడయు మార్పు
ఏల హృదయంబు వెలిపుచ్చ నింతయళుకు? ౬౩

స్వైరికా, నీవు భారతక్ష్మాతలాత్మ
గౌరవ పవిత్రమూర్తివి! శూరమణివి!
ధారుణీపతి పాలనదండ మెపుడు
నీహాలంబు కన్నను బ్రార్థనీయమగునె? ౬౪

దైనికావశ్యకమ్ముల దాఁటిపోవ
వెగుర రెక్కలురాని నీయిచ్ఛ లెపుడుఁ;
బైరుపచ్చలె యవధిగాఁ బ్రాఁకుచుండు
నీవిచారము, నూహయు, నిపుణతయును. ౬౫

ప్రొద్దువొడిచిన దాదిగాఁ బొద్దుగ్రుంకు
వఱకుఁ గష్టింతువేగాని యిరుగుపొరుగు
వారి సంపదకై యీసుఁ గూరఁబోవ
వెంత నిర్మలమోయి, నీహృదయకళిక ! ౬౬

పల్లె యెల్లయె సర్వప్రపంచసీమ !
ప్రియ యొకర్తయె రమణీయ విగ్రహంబు !
బంగరుం బంటపొలములే భాగ్యనిధులు!
అనుదిన పరిశ్రమమె మత మగును నీకు. ౬౭

ఉండి తిన్నను లేక పస్తున్నఁగాని
యాసచేయవు పరుల కష్టార్జితంబు!
నాఁకలెత్తగ నీపంచ కరుగు నతిథి
తినక, త్రావక, పోయిన దినములేదు. ౬౮

కృషి సకల పరిశ్రమలకుఁ గీలుచీల;
సత్పరిశ్రమ వాణిజ్యసాధనంబు;
అఖిల వాణిజ్యములు సిరికాటపట్లు;
సిరియె భోగోపలబ్ధికి జీవగఱ్ఱ. ౬౯

కావునఁ గృషీవలా, నీవె కారణమవు
సాంఘికోత్కృష్ట సౌభాగ్య సౌఖ్యములకు;

ఫల మనుభవించువారలు పరులు; నీవు
గట్టఁగుడువను గలవె యెక్కాలమందు. ౨౦

ఫలముల్మెక్కెడివార్ సత్ఫలరసాస్వాదక్రియాలోలురై
పలుమా రమ్మధురత్వము న్నుతుల సంభావింతురేగాని త
త్ఫలహేతుక్రమవృక్షముం దలఁప రెవ్వారైన, నట్లే రమా
కలితుల్ భోగములన్ భుజించుచు నినుం గన్నెత్తియుం జూతురే?

అట్టి కృతఘ్నులన్ మనమునందుఁ దలంపక సేద్యనాద్యపున్
ఘట్టన నస్థిపంజరముగాఁ దను వెండినఁగాని, వర్షముల్
పట్టినఁగాని, క్షామములు వచ్చినఁగాని శరీరసత్త్వమే
పట్టుగ స్వశ్రమార్జితము పట్టెడు నన్నముఁ దిందు వెప్పుడున్.

రాజకీయ ప్రపంచ సామ్రాజ్యమందు
శౌర్యఖడ్గంబులకు లేదు శాసనంబు;
సంఘరాజ్యంబు నేలు విస్తారశక్తి
సతము నాచార ఘోర పిశాచరాజు. ౨౩

శౌర్యమునకును నాచార చక్రమునకు
మధ్య, లోకంబు దవిలి సమ్మథితమగును;
కాలగర్భంబునందెట్టి ఘటనగలదొ
పూర్వ పద్ధతి విప్లవ స్ఫురణఁ గొలుప! ౨౪

కల్యకాలికము న్నంధకారరాత్రి,
వర్షపాతంబునకు మున్ను వారిదముల
ఢమఢమాడంబరంబులు నమరు; నిదియుఁ
బ్రకృతి భావంబునకు నాత్మపక్షము గాదు. ౭౫

కష్టసుఖముల నీచోచ్చ గతులు గలవు
చక్రదండంబులకుఁబోలె; సమయమందు
నిట్టిమార్పు లనంతమై యెసఁగుచుండు
భావి పరిణామ మెవ్వరు పలుకఁగలరు? ౭౬

ఓకృషీవల ! నీవు కష్టోత్కటంపు
దుర్భరావస్థ యుండె తోఁదోపువడగ
నెవరు శాసించువారు, నీకేమికొదువ?
ఆత్మవిజ్ఞానమయముగా నలవరింపు. ౭౭

దారిద్ర్యంబను పెల్లుటేటి కెదురై దాఁటం బ్రయత్నించుచున్
బూరావేగమునం జలించి వెనుత్రోపుల్పోవు కాంక్షోడుపం
బేరా పొందక నెట్టు తెడ్లగు మన స్వేచ్ఛాప్రకారంబుఁ గా
ర్యారంభంబును ధైర్యము న్విడకుమయ్యా, నీవు వేయింటికిన్.

రార సైరిక, గనుఁగొమ్ము రమ్యమైన
సస్యకేదార ఖండంబు ! సత్కృషీశ

భావలోచన మెరవుగాఁ బడయకున్నఁ
గాంచనేర వంతర్లీన కాంతిసరణి. ౭౯

అనిలాలోలవినీలసస్యములు భంగానీకముల్గాఁగఁ దె
ల్లని కొంగల్పయిఁ దేలు నుర్వులుగ లీలన్ తెక్కలల్లార్ప, మ
ధ్యనురాజిల్లు కుజంబు లోడలుగ వాతస్ఫూర్తిఁ గంపింప, స
స్యనికాయావని సాగరం బటుల నేత్రానందముం గూర్చెడిన్.

కుసుమ లతావలీ వలిత కుంజములం, గిసల ప్రకాండముల్
పసరులు గ్రుక్కు వృక్షముల బాలతృణంబులఁ జేలగట్లు సొం
పెసఁగ, సమస్తరత్నముల నేరిచి కూర్చిన తాలబిళ్లలన్
వసుధ కమర్చిరో కృషికవర్యు లనన్ వరిమళ్లు శోభిలున్. ౮౧

మరకత చూర్ణవర్ణముల మండితమౌ నవశాలిభూమి సుం
దరతను గాంచ వైదిక దినంబులలో భరతక్షమాధురం
ధరయగు సస్యలక్ష్మి దయదప్పక నేఁటికి నార్యధారుణీ
భరణకుతూహలస్ఫురణ భాసిలునో యన నొప్పు హాలికా! ౮౨

కడమొదలులేని నీదేహకష్టములకుఁ
బ్రతిఫలంబగు సస్యసంపత్తి గాంచి
కవివి గాకున్న వాగ్మిత గలుగకున్నఁ
బ్రీతి వర్ణింపు మొకసారి భాగ్యగరిమ! ౮౩

ఆకాశంబున మేఘమాలికల రూపైనం గనరాదు, శు
ష్కాకారంబులఁ బైరులెల్ల సుదుస్సై యల్లాడెఁ, దీవ్రంబుగా
సోకెన్ సూర్యమయూఖతాప, మిఁక నేజోకన్ ఫలించున్ వరుల్
మాకీకష్టము వెట్టె దైవమని యేలా మాటికిం జింతిలన్. ౮౪

కఱకుగ నెండగాయ నిఁకఁ గాలముతప్పె ననంగ నేల ? భా
స్కర కిరణాళిలోఁ గలదు సస్యసముద్ధరణైకశక్తి; త
త్కారణము లబ్ధివారి పయికింగొని యావిరిరూపునన్, నభోం
తరమున మార్చు నీరద వితానముగాఁ బునఃప్రవృష్టికిన్. ౮౫

అల వర్షాగమలక్ష్మిరేఖ యన దివ్యానేక వర్ణంబులం
బొలుపుంబొందు నవాబ్దమాల యదిగో భూభృచ్ఛిరోలంకృతిం
దలపించుం గనుగొమ్ము, వాయునిహతిం దద్దేశముం బాసి కొం
గలబారుల్ వెనువెంట నంట శకలాకారంబులన్ వచ్చెడిన్. ౮౬

బావికి నీటికై యరుగు పల్లెత లంబుధరంబు గాంచి య
ప్పా! వినువీథి హాలికుల పాలిటి దైవమె యంబుదాకృతిన్
భావిఫలోదయప్రకటభావమునం జనుదెంచె నంచు మో
దావృత చిత్తలై సరసమాడుచుఁ బోయెదరో కృషీవలా. ౮౭

పొలమునఁ గంచెగా మొలిచి పువ్వులుపూచెడు కేతకంబు లు
జ్జ్వలకుసుమోపహారములఁ బత్రపుటంబుల నుంచి మారుతా

చలితకిసాలయోచ్ఛలన బ ఱుఁ బిల్చెనుఁ, జేరఁబోయి త
త్కళికఁ బరిగ్రహించి కులకాంతకుఁ గానుక యిచ్చు తమ్ముఁడా.

ప్రావృడంభోదలక్ష్మి యావాసమునకుఁ
బాఱఁగట్టిన నవరత్న తోరణంబు
నాఁగఁ గోమల శబల వర్ణములతోడ
నింద్రచాపంబు శోభిల్లె నిదిగొ చూడు. ౮౯

వానతూనిగ లాకాశ పథమునందు
మధుర ఝుంకారరవములు మందలించెఁ ;
జల్లగాలికి నురుగప్పు లెల్ల మడుల
బెక బెక మటంచుఁ గూసెడి వికటరుతుల. ౯౦

తటములకు నాకసమున కంతరము లేక
నీలనీరదమాలలు వ్రేలుచుంట
నేలపై మిన్ను పడనీక నిలుపుచుండు
స్తంభము లనంగ గిరులు దృశ్యంబులయ్యె. ౯౧

తపనుఁ డంబుదాచ్ఛాదనతతులలోన
మరుగుపడిపోవఁ గని నీలగిరుల చల్లఁ
దనము భువి నాక్రమించిన యనువుగాఁగ
వాయుమండల మీామిరి పట్టియుండె. ౯౨

తెల్లపట్టు మస్లీనుల తెరలలోన
నాడుకొనుచుండు పసిపాప యరువు ద్రోఁప
వానముత్యాలు గూర్చిన వలల తెరల
దినరమామణి మృదుకాంతిఁ దిరుగుచుండె. ౯౩

త్రావ నీరైన దొరకని తరుణమందు
నిమిషమాత్రాన దొరువులు నిండిపోయె!
నఖిలలోకాశ్రయుండు కృపామృతుండు
కన్ను దెఱచిన జరుగని కార్యమున్నె? ౯౪

జల్లు పెల్లుడుగంగఁ బిల్లలు, తల్లులు
నిలువఁబట్టిన నింట నిలువఁబోక,
వాననీరులు వాఱు పల్లపు టిసుకలఁ
గయ్యాగాఁ గట్టలు గట్టి చిన్న
నాగళులం బన్ని లేఁగదూడల గట్టి
దున్నుచు విత్తులు మన్ను గలిపి
పచ్చయాకులు చల్లి పైరుపట్టె నటంచుఁ
గలుపుఁ దీయుచుఁ గోతకాల మనుచు

వరులుగోయుట నటియించి పనలుకట్టి
కుప్పవేయుటగా మన్ను కుప్ప వెట్టి

కడకు నేల చదునుగాఁగఁ గాలఁ దన్ని
యాఁకలెత్తిన నిండ్లకు నరుగుచుండ్రు. ౯౫

జడివానన్ వలిబడ్డ బక్కమొదవుల్ సంఘుంబులై బీళులన్
విడియత్రాడుచు దొడ్డిఁజేర నవిగో వేగంబుగ న్వచ్చెఁ; బె
ల్లడుసుల్వోవని మిట్టనేలఁ బసిఁ గొయ్యల్నాటి కట్టించి వెం
బడి వేయింపుము గడ్డిగాదములు చొప్పల్ బొందుపుల్లాకులన్.

తమ్ముఁడు కట్టఁగోచయము దాఁటులు వెట్టుచుఁ గ్రేపుదామెనం
గ్రమ్ముచు ఱట్టకొట్టుచుఁ బరస్పరముం దల డీలుకొంచు ము
న్గొమ్ములఁ జిమ్ముచుం దిరుగఁ గొట్టెసఁ బట్టిన లొగ్గిరావు, సా
యమ్మొనరింపు నీయదన నాలమరల్పఁగఁ బల్పువెట్టగన్

తడిసిన పచ్చికట్టియలు తంగెడు తప్పర తాటియాకులం
బడఁతుక ప్రొయ్యిలో దుఱిగి పైఁబొగలెత్తగ నూదుఁగాని కూ
డుడుకదు; కాఁకకుం బొగకు నుప్పతిలెం గడగంటబాష్పముల్;
తడయక యెండురెమ్మలను దట్టెదు త్రుంచుమ చెట్టుచేమలన్.

మును వేసంగిని గుచ్చివిడ్డ పిడకల్ బొప్పర్లు బొల్లెంబులున్
వెనుకంబెట్టిన తాటిచుండ్లు బరికెల్ వెల్లించె నిన్నాళ్లు; నిం
క నవాంభోధర మాలికా విహిత దిగ్జాలంబులై వర్షపున్
దినముల్ డగ్గఱెఁ;గాంత బానసము నేతికొప్ప సాగించెడిన్. ౯౯

పొలముల బీళులం దిరిగి ప్రొద్దెడగ్రుంకఁగ నిల్లుసేరి పా
పల నొడిచుట్టుఁ బెట్టుకొని భార్యను నన్నుముఁ దెమ్మటంచు నే
పిలిచెద, వొంటికాఁపురము, పిల్లల గిల్లల బుజ్జగించుకో
వలసిన యాలిపాటుఁ దలఁపఁ గరుణింప వదేల హాలికా. ౧౦౦

ఉప్పుతోఁ దొమ్మిది యున్న కాఁపురములు
సేయు గృహిణుల కేచిక్కు లేదు,
ఎవ్వి లేకున్నను నిరుగు పొరుగు కులాం
గనలకుఁ జేయొగ్గి గైకొనుటకు
నిష్టపడక, యున్నదే పెట్టి యక్కఱ
వాపుకొనెడు మానవతుల కెందు
లేమిడి సంసార మేమెయిఁ బరువుతోఁ
గడపంగ నిక్కట్లు గలుగుచుండు,
నెన్ని కష్టములున్న నిట్లని పలుకక
పొసగినయంతకుఁ బొదుపు చేసి,

మగనికిని బిడ్డలకుఁ బెట్టి మిగిలియున్న
యింతెఁ దాఁ దిని భిక్షున కిడు పురంధ్రి
శాంతి నీతియు నురుకష్టసహనశక్తి
నెవరెఱుంగుదు రంతటి యింతి దక్క ! ౧౦౧

తలతోకటులు వెట్టి ధనికుల దగ్గఱఁ
బన్నుకై గొన్న రూపాయలప్పు
కూలికి నాలికిం గూటికిం జాలక
నాముగాఁ గొన్న ధాన్యంబుటప్పు,
చిల్లర మల్లర చేబదులుగఁ దెచ్చి
యక్కఱ గడపిన యట్టి యప్పు
పండుగపర్వాల బంధుల విందుకై
సామానుగొన్న బజారుటప్పు

వాయిదా మించవచ్చిన వడ్డియప్పు
పడఁతిసొమ్ముల కుదువకుఁ బడ్డయప్పు
వేగ తీఱిచి స్వాతంత్ర్యవీథి యందు
సంచరింపుమ నిశ్చింత సంతతంబు. ౧౦౨

పవలు నడచుఁబ్రొద్దు; తొవవిందు రేవేళఁ;
బవలు రేయి నడచుఁ బాడువడ్డి !
అప్పుచేసిఁకుడుచు పప్పుకూళుల కన్నఁ
గాసు ఋణములేని గంజి మేలు. ౧౦౩

సంఘపరివర్తనంబులు జరుగుచున్న,
రాజకీయ సంక్షోభంబు రగులుకొన్న,

విప్లవంబుల దేశమ్ము వీఁగుచున్నఁ,
గృషిఁ ద్యజింపకు కర్షకా, కీడు గలుగు. ౧౨౩

నవ్యపాశ్చాత్య సభ్యత నాగరకత
పల్లెలందు సస్పష్టరూపములఁ దాల్చి
కాలసమ్మానితములైన గ్రామపద్ధ
తులను విముఖత్వముం గొంత గలుగఁజేసె. ౧౦౪

పంచాయతీసభా భవనంబులో రచ్చ
కొట్టంబు లోకమూలఁ గూలిపోయె,
వీథిబడులఁ జెప్పు విజ్ఞానధుర్యులు
నోజ్జలు దాస్యంబు నూతగొనిరి,
గ్రామపరిశ్రమఁ గలుగు నన్యోన్యమౌ
సహకారవృత్తంబు సమసిపోయె,
సత్యజీవనము, విశ్వాసమ్ము, భక్తియు
నైకమత్యము మున్నె యంతరించె

బూటకములు, కుయుక్తులు, మోసగితులు
కోర్టువ్యాజ్యాలు, ఫోర్జరీల్, కూటమైత్రి,
స్వార్థపరత, మౌఢ్యంబు, గర్వప్రవృత్తి
నేర్పు విద్యాలయంబులు నేఁటియూళ్లు. ౧౦౬

నేఁటి నాగరకత నీమేలుఁ గోరక
యప్పుచేసి బ్రతుకుమని విధించు ;
నాయువృద్ధికన్న నావశ్యక పదార్థ
సంఖ్య హెచ్చెఁ జిత్తశాంతి యున్నె ? ౧౦౭

జీవనస్పర్ధసామాన్యచేష్టమైన
కాలమున వ్యక్తివాద మగ్రత వహించు
సత్త్వవిరహితుఁ డన్యభోజ్యత నశించు ;
సర్వజీవియె యంతరాయముల దాఁటు. ౧౦౮

కాన, జీవనసంగ్రామ కార్యమందు
విజయి వగుటకు శౌర్యంబు విద్య బుద్ధి
సత్యసంధత యాత్మవిశ్వాస మనెడు
నాయుధంబుల విడువకు హాలికవర్య. ౧౦౯

చాలు విజ్ఞానమతబోధ! సాంధ్యరాగ
కాంతిఁ బండిన కేసరి కారుచేలు
స్వర్ణసైకత ఖనులుగాఁ బరిణమించెఁ
గనుల కాప్యాయనంబుగఁ గాంచుమోయి. ౧౧౦

బారులుదీరి యంబరముపైఁ జరియించెడు నీటికోళ్ళు లిం
పారఁగ సాంధ్యలక్ష్మి మెడయందు ధరించిన తారహారరే

ఖారమణీయతం జిలుకఁ గాలువనీటికి నేగు కన్యకల్
వారక కొంతసేపు కనువాల్చక చూతురు విస్మయంబునన్.

గోపదధూళిధూసరిత గోపకుమారులుఁ గాఁపుపిల్లలున్
మూపునఁ గట్టలుం జలిదిబోనపు దుత్తలు, చంకలోనఁ బె
న్మోపెడు దూడపల్పు లిడి మోహనవేణురవంబు సేయుచున్
మాపటివేళగాఁ బసులమందలు దోల్కొనివచ్చి రిండ్లకున్.

స్వారిచేయు నిచ్చ భావంబు గిలిగింప
బఱ్ఱె నెక్కి వచ్చు బాలుఁ డొకఁడు:
వానిఁ గ్రిందఁద్రోయువఱకు బఱ్ఱెను బాది
సంతసింతు రితరసఖులు నగుచు. ౧౧౩

బడి విడిపించంగ బాలురు వీథులఁ
బరుగెత్తి యుప్పరపట్టెలాడ,
పంటచేలకుఁ బసిపాటుల కేఁగిన
కర్షకు లిండ్లకుఁ గదలుచుండ,
స్నానంబు లొనరించి సరసుల భూసురుల్
భక్తిభావన సంధ్య వార్చుచుండ,
సందాకపళమమ్మ సత్రమేజయమని
యన్నార్థులగు భిక్షు లరుగుదేరఁ

బక్షు లెల్లను గూళులఁ బట్టిచనఁగ
నచ్చటచ్చటఁ దారక లవతరింప
మొలకచీఁకటి దిక్కులు మలినమయ్యె,
సంజ రాతిరి గర్భాన సమసిపోయె. ౧౧౪

ఇంతకు రాఁడు కాంతుఁడని యింతి విచారముతోడ ద్వారబంధాంతరమందు నిల్చి కనులార్పక దారులు చూచుచుండ నీవంతగ నాలసింపఁ దగవా, మగవారలయట్ల కాతరస్వాంతలుగాక, కామిను లనాగతకష్టము లెంతు రెప్పుడున్.

ఆమెను రచ్చలోని వ్యవహారము, లూరక పొల్లుమాటలం బోయెను నర్ధరాత్రి, మిఁకఁబొమ్ము గృహమ్మునుజేర, బిడ్డలున్ నాయన నాయనంచుఁ గరుణమ్ముగ నేడ్చుచున్నవారు, మున్నాయితపెట్టె స్నానమునకై నులివెచ్చని నీరు భార్యయున్.

ల య వి భా తి

చలువగల కప్పురము చిలికినటు చల్లనయి
లలితకలధౌత మృదువిలసనము పోలెన్
మొలకలిడు వెన్నెలల చెలువము దిగంతముల
కలముకొని తారకల తళుకులను గప్పం

గలువపొడి గందవొడి దొలఁక సుడిరేఁగుచును
మెలఁగు నెలపయ్యెరలు నలసతఁ జరింపం
దలఁపున రసార్ద్రమగు వలపు లిగురింప, దిన
కలకల మడంచి నిశ గొలిపెఁ బ్రమదంబుల్.

స్నాన మొనరించి, వెన్నెలచలువ బయల
బిడ్డలు న్నీవు నిల్లాలుఁ బ్రీతి గుడిచి
పొడుపుకతలు, సమస్యలుఁ, బూర్వచరిత
లంత వచియింపు వారలు సంతసింప. ౧౧౭

శ్రమ, విషాదమ్ము, లాసలు, సర్వకాల
హృదయభేదకచింతలు నిదుర యనెడు
శాంతవారిధి లీనమై సమసిపోవ
విశ్రమింపుము, సైరికా, వేగువఱకు. ౧౧౮

గోనుగుంట్ల ముద్రణాలయము, 15, బ్రాడ్వే, మదరాస్.